# మాంగుళూరు మెయిల్

బొంబాయి మెయిలూ, కలకత్తా మెయిలూ, బెంగుళూరు మెయిలూ మొదలైనవన్నీ ఒక ఎత్తు; మాంగళూర్ మెయిల్ ఒక్కటీ ఒక ఎత్తు. మాంగళూర్ మెయిల్ అంటే నాకు మహా చెడ్డకోపం. నన్ను అన్యాయం చేసిందది. దాన్ని చూస్తేనే కడుపులో చెయ్యిపెట్టి కలచినట్లవుతుంది.

మంజులత—మంజుల—మంజు. మూడు నామాంతరాలు. మంజుల ఈనాడు నొట్టి స్మృతి. చల్లటివేళ తలుచుకోవలసిన కమ్మటిజ్ఞాపకం. కాలం గడిచినకొద్దీ మనుష్యులు స్మృతులుగా మారిపోతారు. కడపటికి జీవితంలో మిగిలేవన్నీ స్మృతులే. కొన్ని బాధించేవి. కొన్ని సేదదీర్చేవి. మరికొన్ని జ్ఞాపకాలు మైలురాళ్ళలా జీవితనడకని లెక్కిస్తాయి. మంజుల స్మృతి మైలురాయి కాదు. అదొక అపూర్వానుభవం—ఒక కాంతి కిరణం.

పుష్కరం పైన అవుతుంది. కాని యిప్పటికీ మంజుల కళ్ళముందు మెసులుతూనే ఉంది మాంగుళూర్ మెయిల్ సెంట్రల్ ప్లాట్‌ఫారమ్‌మీద కనిపించినప్పుడే కాదు; ఏ మళయాళపు అమ్మాయి కనిపించినా మంజు ఆమెలో లీలగా గోచరిస్తుంది. మంజు నా హృదయంలోని హృదయం. ఆమెగురించి కథ అల్లడం చాలాకష్టం. కథ అల్లేందుకు తగినన్ని సన్నివేశాలు మా యిద్దరిమధ్యా గాని, మా

చుట్టూరా గాని లేనేలేవు. జీవితంలోని వ్యక్తులు కథలో పాత్రలకి మల్లే ఒక వరవడి ననుసరించి నడవరు. కథా పాత్రలు ఒక పరిణామాన్ని బట్టి పెరిగి పెద్దవవుతాయి. జీవిత వ్యక్తులతో అలా కుదరదు. వారు ఎక్కడో ఎప్పుడో అమాంతం తటస్థపడి, వారికి అనుగుణంగా మన జీవన క్రమాన్ని మార్చడానికి ప్రయత్నించి, ఫలితంతో ప్రమేయం లేకుండా టుపుక్కున మాయ మవుతారు. కథాపాత్రలు రచయిత యిష్టానుసారం నడుస్తాయి. జీవితంలో మనుషులు వాళ్ళ యిష్టానుసారమే నడుచుకోలేరు, పరిస్థితుల వొత్తిడి ప్రకారం నడవవలసిందే! అంచేత జీవితంలోని ఒక ఘటనని తెరచి పాఠకుని ముందు పెడుతున్నప్పుడు, అందులో కథా లక్షణాలు లేకపోవచ్చు.

పన్నెండేళ్ళో పద్నాలుగేళ్ళో అయింది. ఒక హోటల్లో మూడో అంతస్తుమీద తొమ్మిదవ నెంబరు గదిలో ఉంటు న్నాను. టర్నీవ్ 'జ్యూ' లోని కథాభాగం నాకు జ్ఞాపకం లేదుగాని, ఆ కథ చదివి కన్నీళ్ళు కార్చిం దాగదిలోనే. డాస్టవిస్కీ 'క్రయిమ్ అండ్ పనిష్మెంటు' చదివి, ఒక రోజల్లా అన్నం మానేసింది అక్కడ ఉంటున్నప్పుడే. ఈనాడు హృదయం అలా స్పందించదు; తర్కిస్తుంది. ఇతర గ్రంథాలతో పోలుస్తుంది. అసలు రసాస్వాదనలోనే బోలె డంత తేడా. ఆనాడు లేతగుండె—ఈనాడు ఒక రకంగా రాతిగుండె. పాషండుణ్ణి కాకపోవచ్చు; ఆ కరకుతనాన్ని

Iron in the soul అని నాకు నేను సమర్థించుకోవచ్చు. లేత గుండె కాలంలో, ప్రథమ యవ్వనపు దినాలలో, నేనా హోటల్లో ఉంటూఉండేవాణ్ణి.

హోటల్‌లో పర్మనెంటుగా ఉండటం తమాషాగా ఉంటుంది. పర్మనెంటు అంటే ఎల్లకాలమూ కాదు—ఏ ఆరు నెలలో, సంవత్సరమో మన మొక్కళ్ళమే పర్మనెంటుగా ఉంటూంటాము; మిగతావాళ్ళు వస్తూ పోతూ వుంటారు. ఏరోజు కారోజు కొత్త మొహాలు కనిపిస్తాయి. అదీ కాక పట్నం హోటళ్ళలో దినమూ ఏదో ఒక విశేష ముండక మానదు. పట్నం చూదామని వచ్చే పామరులూ, లేచిపోయివచ్చే జంటలూ, వ్యాపారరీత్యా వచ్చేవారూ, ఊసుపోక గుర్రప్పందాలకోసం వచ్చేవారూ—రకరకాల మంది. వీళ్ళందరూ నాలుగురోజు లుంటారు; వారంరోజు లుంటారు. మనం పర్మనెంటుగా ఉంటున్నప్పుడు, హోటల్ వాళ్ళు వీళ్ళందరిమీదకంటె మనమీద ఎక్కువ శ్రద్ధా భక్తులు చూపడం సహజం.

అదే సేట్‌జీ, ఆయన అనుచరవర్గం నా పట్ల చూపుతూ వుండేవారు. రెండురోజుల కొకసారి అయినా నా గదికి వచ్చి యోగక్షేమాలు కనుక్కుని వెళ్తూండేవాడు సేట్‌జీ; వ్యాపారంలోని సులువు బలువులు చెప్తూవుండేవాడు. నిజానికి నేనూ మిగతావా రందరికీ మల్లేనే ఒక కస్టమర్ని; కాని సేట్‌జీ నన్ను తనవానిగా భావించేవాడు. ఆ మిత్రత్వధోరణి

వల్ల నాకు పెద్ద కలిసొచ్చిం దేమీ లేదు. సేట్ జీ ఫ్రెండ్ ని అయినా కాకపోయినా నౌకర్లు వాళ్ళకందే టిప్స్ నిబట్టి నా పనులు సక్రమంగానే చేస్తారుగా!

"హోటల్లో ఎందుకుంటున్నారు?" అని అడక్కండి. అది నాయిష్టం. ఉంటున్నాను. కథలు రాసేవాణ్ణి (అచ్చు యేవి కూడాను); పుస్తకాలు చదివేవాణ్ణి; తిని తిరిగేవాణ్ణి. తడుముకోవలసిన అవసరం లేనంత డబ్బు బాంకులో ఉండేది ఆరోజుల్లో నా గదికి ఒక్కడే స్నేహితుడు వస్తూండే వాడు. దారుణంకాదూ యిలాటి మహానగరంలో ఒకే ఒక్క స్నేహితుణ్ని కలిగివుండటం! కాని వెంకటపతి ఒక్కడే ఆ రోజుల్లో స్నేహితుడు. వెంకటపతిని 'పతి' అని పిలవాల్సిందే—'వెంకటపతి' అనకూడదు. వెంకటపతి అని అంటే ఈ జన్మకి తనకి ఏజంటయే యోగ్యత ఉండదట—యిప్పుడు వుండి ఏడిసినట్టు! న్యూమరికల్ గా అంతేనట. ఏమయితేనేం. ఈ పతి జీవితం ఒక ట్రాజడీ. అతనిది నిత్య దరిద్రం. దినమూ అతని చేతులమీదుగా అరవై డెబ్భయి వేలు తిరుగుతున్నా, సాయంత్రం కాఫీకి డబ్బులుండేవి కాదు. అతని ఉద్యోగం బాంకులో కాషియర్ పని. వారానికి అథవా ఒకసారైనా నాలుగో ఐదో అప్పుకింద తీసు కెళ్లే వాడు నాదగ్గిర్నుంచి. ఆ చిల్లర మొత్తాలు అన్నీ కలిపి నల భయ్యో, ఏభయ్యో అయిన తర్వాత ఒక అణాస్టాంపు అంటించి నోటు రాసేవాడు. అలా రెండో మూడో నోట్లు

రాశాను. ఒక్క దానిమీదా ఒక రూపాయికూడా చెల్లు వెయ్యలేను. పాప —అతనికి యుద్ధామనే వుండేది; డబ్బు మిగిలేది కాదు. సూక్ష్మంలో చెప్పాలంటే వెంకటపతిని స్నేహితుడనడం కూడా అసందర్భమే. నాతో అవసరముండేది కనక నన్ను పట్టుకు తిరిగేవాడు.

మంజులత కథ మొదలు పెట్టి సేట్ జీ గురించీ, వెంకట పతి గురించీ తెగ చెబుతున్నాను. సేట్ జీ నేనుంటున్న హోటల్ యజమాని; వెంకటపతి నాకానాడున్న పరిచయుడు. పతి ఒక సాయంత్రం ఆరుగంటలకి నా గదిలోకి వచ్చి, బీడీ మరికాస్త ఘట్టిగా పీల్చి (సిగరెట్లకంటె బీడీలే ఎక్కువ యిష్టం అతనికి), "ఐదో నెంబరు గదిలో రంగుల రామచిలక ఉందే," అన్నాడు.

నాకు నెగటుతోంచింది. స్త్రీని చులకనగా మాట్లాడటం నాటికీ నేటికీ కూడా నాకు రుచించదు. ఆమె కట్టూబొట్టు మనకి నచ్చినంతమాత్రాన రామచిలక అనడమేనా ? ఎవరో అమ్మాయిని అంత సులువుగా అనగలిగినవాడు, తన చెల్లెలో్నో భార్యనో అదేమాట పరాయివాడు అంటే సహించగలడా ? నాలుగూ పెట్టాను వెంకటపతిని. కిమ్మనకుండా వూరుకున్నాడు.

"ఏమయినా ఆడవాళ్ళని అంత తల కెక్కించుకో కూడదు," అన్నాడు వెంకటపతి.

"ఈశ్వరుడికంటె దిగి వచ్చారూ ? ఆయనని మించి ఘనులము కాముకదా !" అన్నాను.

ఇంతలో సేట్‌జీ వచ్చి వెంకటపతి వున్నాడని సుగాబుచి వెళ్ళిపోయాడు. పతీ నేనూ ఆ సాయంత్రం సినిమాకి వెళ్ళాం. నేను రాత్రి తొమ్మిది గంటలకి హోటల్‌కి వచ్చేటప్పటికి, సేట్‌జీ నాగది ప్రాంతాల తచ్చాడుతున్నాడు. ఏడుగంటల వేళకి యింటిదగ్గిర హాజరై, భార్యని బీచికి తీసుకువెళ్ళే అలవాటు అతనికి. ఇవ్వాళేదో కొంప మునిగినట్లుంది.

"మీకోసమే వెయిట్ చేస్తూండాను, సాబ్."

"ఏమిటి విషయం?"

"అంజి నంబర్ సూస్తిరా. అందయ్యా ఖాతాలనించి కానహీ అమ్మా యిరికి రాంగో, ఎయిటీన్ రుపీస్ ట్వెల్వ యనాస్ దూ్య."

మిగతా సంభాషణ సేట్‌జీ పలుకుల్లో చెప్పను. నా మాటల్లో చెబుతాను. ఐదవ నెంబరు గదికి రామనాథ్ అనే ఆయన అయిదురోజులక్రితం బొంబయినుంచి వచ్చాడట. రాగానే పదిరూపాయలు అడ్వాన్సు యివ్వమంటే, ఐదురూపాయిలే యిచ్చి, మిగతాది మర్నాడు యిస్తానన్నాడు. మొదటిమూడురోజులూ తను ఒక్కడే వున్నాడు. రెండురోజులక్రితం, మొన్న సాయంత్రం, ఆ అమ్మాయి హాస్పిటల్‌నుంచి డిశ్చార్జి అయివచ్చింది. డబ్బుకి వొత్తిడి చేస్తే ఈ పూటా ఆ పూటా అని మొహం చాటేస్తున్నాడు. నిన్న సాయంత్రం సేట్‌జీ గది ఖాళీ చెయ్యమన్నాడు— డబ్బు యివ్వకపోవడంవల్ల. యివ్వాళ పొద్దున్న కాఫీ యిడ్లీ

సప్లయిచేశారు—సేట్ జీ రాకపూర్వం. భోజనం సప్లయి చెయ్యనద్దన్నాడట, సేట్ జీ తను వచ్చినతర్వాత. అయ్యా లేదు అమ్మ ఒక్కతే ఉందని తెలుసుకు, జాలిపడి, మధ్యాహ్నం టిఫిన్ పంపించాడు. అమ్మ టిఫిన్ తిరగ్గొట్టి, కాఫీ మాత్రం పుచ్చుకుంది. పొద్దున్న ఏడు గంటలకి వీధి మీాదికెళ్ళిన రామనాథ్, యిప్పుడు రాత్రి తొమ్మిదయింది, యింత వరకూ రాలేదు. తనకేమి చెయ్యాలో పాలుపోకుండా ఉంది. వీళ్ళిద్దర్నీ హోటల్నుంచి గెంటించడమెలా? తనకి రోజుకి మూడురూపాయిల నష్టం.

891.8133 CHA

"సేట్ జీ, ఈ రాత్రికి వాళ్ళిద్దరికీ భోజనం పంపండి. ఆ అమ్మాయికి పొద్దుట్నుంచీ తిండి లేదనుకుంటాను. మీరు యింటికి వెళ్ళిపోండి. రాత్రి పన్నెండు గంటలకైనా ఆ రామనాథ్ రాకపోడు. నేను రాత్రి రెండుగంటలదాకా చదువుకుంటూ వుంటాను గనక ఆయన వ్యవహారమేదో తెలుసుకు, రేపు పొద్దున్న మీకు చెబుతాను. ఆడది, ఆ పిల్లని, పస్తుపుంచడం మనకి దోషం." సేట్ జీకి నామాటమీాద గురికనక నేను చెప్పినట్లు చేశాడు.

R.11

ఆ రామనాథ్ రాత్రి పదకొండుగంటలకి పిల్లిలా చక్కా వచ్చాడు. మనిషి సన్నగా పూచలా ఉంటాడు; పక్షిముక్కు; వామనచాయ; తరుముకొస్తున్న తోడేలునుంచి పారిపోతున్నట్టుంటుంది అతని మొహం. వర్చస్సేమీ లేదుగాని ఆ కనురెప్పల్లో తీక్ష్ణతా, ఆవేదనా ఉన్నాయి. వయసు యిరవై రెండూ యిరవై మూడూకంటె ఎక్కువ ఉండదు.

వరండాలో రెండుమూడుసార్లు పచార్లు చేశాను. వాళ్ళ గదితలుపు వోరవాకిలిగా ఉంది. అతి నెమ్మదిగా మాటలు చెప్పుకుంటూ భోజనాలు చేస్తున్నారు. వెంకటపతికి రామచిలకలా కనిపించిన అమ్మాయి పీలగా రోగిష్టిలా ఉంది. పదిహేడేళ్లుంటాయేమో; సర్వసామాన్యమైన చీరె కట్టుకుంది. భార్యాభర్తలిద్దరూ ఒకళ్ళ నొకరు-నాకు తెలియని భాషలో-డబాయించుకుంటున్నారు. భోజనమయాక రామనాథ్ సిగరెట్టు ముట్టించి వరండాలోకి వచ్చాడు. దూరంగా నుంచున్న నన్నుచూసి కొద్దిగా కలవరపడ్డాడు—ఆ కాల్చుకోవడం గదిలోనే కాల్చుకోక బయటి కెందుకొచ్చానా అన్నట్టుంది అతని మొహం.

ట్రాములూ బస్సులూ ఆగిపోయి చాలాసేపయింది. నిర్జన వీధుల్లో అక్కడక్కడ రిక్షాలుమాత్రం సంచారం చేస్తున్నాయి. రైలింజను అప్పుడప్పుడు కూస్తోంది. పేవ్‌మెంటు కుటుంబాలవంక బాధగా చూస్తున్నాను. రామనాథ్‌ని ఎలా పలకరించడమా అని నే ననుకుంటూవుండగా, అతనే నన్ను పలకరించి నా బుజాలమీద బరువుని కిందికి దించాడు.

"మాఆవిడ చెప్పింది—మీతో సేట్‌జీ ఏమిటో చెబుతున్నాడటగా!"

తను నమ్రతగా ఉండటం బోయి పెద్దఖబుర్లాడుతున్నాడే ఈ పెద్దమనిషి—అనుకున్నాను లోపల. "నాతో ఏమీ

చెప్పలేను. రామ్‌నాథ్ అంటే మీ రేకదూ!—మీకోసం వెయిట్ చేస్తున్నా నన్నాను.''

ఈమాటా ఆ మాటతో అరగంటలో కథ బయట పడింది. రామనాథ్ నన్ను పరిచయం చేశాడు మంజులతకి. రామనాథ్ అయినా పైకి పొగరుమోతులా కనిపించాడు గాని ఆంతర్యంలో మంచివాడే. బక్కచిక్కివున్నా మంజులతది ఆకర్షవంతమైన ముఖం. ఆమె అందమంతా కనుబొమలలో ఉంది. కనుకొలకులలోని కాంతిరేఖ చెక్కిలి సొట్టదగ్గిర విల్లంబులా తిరుగుతుంది. గడ్డం ఒక చూపువాసి పొడవు. సిల్కులాంటి జుట్టు బాబ్ చేయించుకుంది. చీరె, జాకెట్టూ చవకధరవి. ఎర్రటి దుద్దులు మినహా నగా నాడెం వొంటిమీద లేవు. బాగా జబ్బుపడి లేచిన మనిషి. తమిళంలోనూ యిగ్లీషులోనూ కలిపిగొట్టుగా మాట్లాడేది. రామనాథ్‌మీద ఆమెకున్న అనురాగం తుణతుణానికీ చూపులో, సైగలో, మాటలో వ్యక్తమవుతూనే వుండేది.

అస్వస్థురాలు కనక మంజులత మంచంమీద పడుకుంది. రామనాథ్, నేనూ కుర్చీలలో కూచున్నాం. అతను పదకొండుం బావుకి మొదలెట్టిన కథ పూర్తయేటప్పటికి ఒంటిగంటన్నర అయింది. అంతవరకూ మంజులత రెండుకళ్ళూ తెరుచుకు చూస్తూనే వుంది మా యిద్దరివంక. ఆమెని నిద్దర పొమ్మని అతనూ చెప్పాడు, నేనూ చెప్పాను. 'నిద్దర రావడంలేదు—నిద్దరొస్తే మీరు చెప్పాలా?' అంది.

రామనాథ్, మంజులత ఒకరొక్కరు తీవ్రంగా ప్రేమించు కున్నారు. వివాహానికి కులాలేగాక శాఖలుకూడా సరిపడాలిగా! మంజులతకంటె రామనాథ్ కొంచెం తక్కువ కులం వాడు. మంజులత తలిదండ్రులు శాస్త్ర కలవాళ్ళు. అంచేత, కులంతక్కువ—ధనం తక్కువ వున్న రామనాథ్‌తో ఎలా సరిపెట్టుకుంటారు? కూతురికి కట్టడులు ఏర్పాటు చేశారు. తత్ఫలితంగా యిద్దరూ పారిపోయి పెళ్ళిచేసుకున్నారు. మధురలో డాక్టరీ చేస్తున్న మంజులత అక్కగారు కూడా ముక్కుమీద వేలేసుకుంది బొంబయిలో టైపిస్ట్‌గా చేరాడు రామనాథ్. మూడేళ్ళూ మూడు రోజుల్లా గడిచిపోయాయి. ఆరోగ్యం చెడిపోయింది. మద్రాస్‌లో ఉన్న రామనాథ్ పినతండ్రి వారికి సాయం చేస్తానన్నాడు. మంజులగని మొట్టమొదట తన పినతండ్రిగారింటికే పంపించాడు రామనాథ్. పినతండ్రి పినతల్లీ ఆమెని హాస్పిటల్లో జేరిపించి, స్త్రీలవ్యాధి తాలూకు ఆపరేషన్ అయిన తర్వాత, బొంబయిలో ఉద్యోగం మానుకు మద్రాస్ రమ్మని రామనాథ్‌కి రాశారు. రామనాథ్‌కి ఆమాత్రం ఉద్యోగం యిక్కడ దొరక్కపోతుందా—అనుకున్నారు. ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉండొచ్చనుకున్నారు. అనుకోకుండా ట్రాన్స్ఫర యింది ఆ పినతండ్రికి. అంతకీ ఆయన రామనాథ్‌ని రెండు మూడు ఆఫీసులకి తీసుకువెళ్ళి పరిచయం చేశాడు. రేపో మాపో ఉద్యోగం రావచ్చోదు. ఈ మందులకీ మాకులకీ మంజులత

వొంటిమీదవున్న బంగారం యావత్తూ అమ్మేయ్యవలసి వచ్చింది.

రెండుగంటలకి నా గదిలోకి వెళ్ళి పక్కమీద పడుకున్నానేగాని ఒక పట్టాన కునుకురాలేదు. లోకంలో ఎంత బాధ. ఎంత నిస్సహాయత! ఏమైపోతారు వీళ్ళిద్దరూ! ప్రేమించి పెళ్ళి చేసుకోవడం బట్టేగదా వీళ్ళకిన్ని అవస్థలు. కాన్నమూర్ లోనో, మాంగుళూర్ లోనో వున్న మంజులత తండ్రికి వీళ్ళమీద అంత కక్ష ఎందుకు? పితృహృదయం, వాత్సల్యం, దయా దాక్షిణ్యాలూ యివెక్కడ? అలాటి వున్నాయా అసలు, పుస్తకాలలో మినహా! ప్రతిమనిషీ, తెలిసో తెలియకో, స్వంతలాభం కోసమే చేస్తున్నాడు. నా గదిలోకి కనిపించే లైట్ హావుస్ వెలుగు ఎన్నో వెర్రి ఆలోచనలకి తావిచ్చింది. సూర్యుని మునుదు కిరణం నన్ను తట్టిలేపింది.

కాఫీ సేవించి, పేపరు తిరగేస్తూండగా సేట్ జీ వచ్చాడు. తన జేబులోనుంచి ఒక చిన్న పొట్లంతీసి నా టేబుల్ మీద పెట్టాడు.

"చూడండి–పొట్లంలో ఏముందో! ఆసామ్మి నా దగ్గిర వుంచుకోమని చెప్పిపోయాడు పొద్దుటే. ఇదేదో దగుల్బాజీ వ్యవహారంలాఉంది." సేట్ జీ అంత స్వచ్ఛంగా మాట్లాడలేదు. కాని ఆయన మాటలలోని సారాంశం అది.

పొట్లంలోవి మంజులత ఎర్రదుద్దులు. నా ప్రాణం కాస్త చివుక్కుమంది. గడిచినరాత్రి వాళ్ళతో అంతసేపు కాల

క్షేపం చెయ్యడమే ఆక్షణిక చాపల్యానికి కారణం. పట్టు కుచ్చులాంటి జుట్టు ఎర్రదుద్దులమీద పడినప్పుడు ఏదో తమాషాగా ఉండేది. అదేమీ అందం అనీ, ప్రత్యేకశోభ అనీ కాదు. పూచికపుల్ల బంగారంలేని ఆమె పచ్చటి శరీరం మీద, ఆ దేహకాంతిలో ఆ ముఖ వర్చస్సులో ఎర్రదుద్దులు ఒక రకమైన వింత ఆభరణం. సేట్‌జీ గుప్పిట్లోనుంచి రామనాథ్ ఆ దుద్దుల్ని ఏనాటికీ విడిపించలేడని నాకు అనుమానం కలిగింది.

“వాళ్ళ దుద్దులు వాళ్ళకి యిచ్చెయ్యండి. వారు మీ కివ్వవలసిన పైకం నేనిస్తాను” అంటూనే, పాతిక రూపాయల చెక్కు సేట్‌జీ చేతిలో పెట్టాను. సేట్‌జీ తెల్లబోయాడు. నే నెందుకు అలా చేస్తున్నానో అతనికి బోధపడలేదు. నేను మర్యాదస్తుణ్ణీ, బుద్ధిమంతుణ్ణీ, వృద్ధిలోకి రావలసినవాణ్ణీ అని సేట్‌జీకే కాదు. హోటల్ స్టాఫ్ కందరికీ తెలుసు; అంచేత, బక్కచిక్కివున్న ఆ అమ్మాయిమీద మనసు వుండి నేనిలా పూనుకున్నానని ఎవరూ అనుకోలేరు, నిజం కూడా అంతేగా! త్రుటికాలం తటపటాయించి చెక్కు జేబులో పెట్టుకున్నాడు సేట్‌జీ.

“దుద్దులు రామనాథ్‌కి యివ్వనా, ఆ అమ్మాయికి పంపించేదా?” అని అడిగాడు.

“రామనాథ్‌కి యివ్వవద్దు—యిటు నా కివ్వండి.”

మారుమాటాడక ఆ పొట్లం నా చేతిలో పెట్టాడు సేట్. ఆ ఉదయంవేళ ఆతనికి లోకమంతా అగమ్యగోచరంగా తోచివుంటుంది.

ముద్దులపొట్లం నౌకరుద్వారా పంపించక నేనే తీసుకువెళ్లి యిద్దామనుకున్నాను. పొరబాటేమో - నావయస్సింకా 'టీన్సు' దాటలేదు. ఒక గొప్పపని చేసి అందుకు ప్రతిఫలంగా పట్టాశాలువా నాకు నేనే కప్పుకుందామనుకున్నాను. నేను వెళ్ళి తలుపు తట్టకబోతే, మంజులత తనకి తానుగా నాకు కబురంపించేదా? నరాలు తోడే బాధతో, జీవనాంధకారంలో ఏమయేదో! నాకు కబురంపించి వుండేది కాదేమో! అలా నిశ్చితంగా కళ్ళుమూసేసేదేమో! ఏమంటావు—ఈ కథ చదవలేని మంజూ?

సంశయిస్తూ నేను తలుపుతట్టేటప్పటికి మంజులత తలుపు తెరిచింది. తెరిచిన తలుపు అలాగే వుంచి, మంచంమీద కెళ్లి పడుకుని ఉండ జుట్టుకుపోవడం మొదలెట్టింది. రాత్రి కనిపించిన వెలుగు ఆమె మొహంలో లేదు. కళ్ళు గుంటలు పడ్డాయి. బాధతో ముఖం ఎర్రబడింది. కడుపు నులిమేస్తోందంటారే స్త్రీలు—అలాటి బాధట. మాట చెప్పలేక గలగల కొట్టుకుంటోంది. నాకు కళ్ళనీళ్ళు తిరిగాయి. అలాటి బాధ నే నంతవరకూ చూడలేదు. ఏం చెయ్యాలో తోచక కుర్చీలో కూలబడ్డాను.

పదినిముషాలకి తెప్పరిల్లి, "తెల్లారిగట్ల నాలుగు గంటల నుంచీ యిలా బాధపడుతూనే వున్నా, తప్పనిసరి కనక

ఆయన బయటికి వెళ్ళారు. ఆ పద్బాంధవుడిలా వచ్చారు మీరు. హోటల్ నౌకరు ఈ గదివైపు తొంగిచూడటమే లేదు. లోకమే అంత. ఒక కప్పు కాఫీ తెప్పించి పెడుదురూ—గొంతుక తడిఆరిపోతోంది.'' ఆమె యింత స్పష్టమయిన తెలుగుమాటలలో చెప్పలేదు. తమిళం యింగ్లీషూ కలిపి మాట్లాడింది.

వరండాలోకి వెళ్ళి హోటల్ నౌకర్ని ఆజ్ఞాపించగానే వాడు తక్షణం వేడివేడి కాఫీ పట్టుకొచ్చాడు. మంజులతకి ఆ కాఫీ చల్లార్చి పెట్టి యిచ్చాను. గడగడ తాగి, నిస్త్రాణ వచ్చినట్టు తలగడమీద తల ఆన్చింది. విల్లంబుల్లాటి కనుబొమల్ని వెక్కిరిస్తున్నాయి-ఆమె ఎర్రటి పెదవులు. దుద్దుల పొట్లం యింకా నా చేతిలోనే వుంది.

రెండు నిముషాలు గడిచాయో లేదో, నన్ను పక్కకి తప్పుకోమని చేతితో సంజ్ఞచేస్తూ, మంచానికి అవతల పక్కగా తాగిన కాఫీఅంతా వాంతిచేసుకుంది. వాంతి అయినప్పట్నుంచీ ఆయాసం ప్రారంభమయింది. గుండె దడ హెచ్చింది. నౌకరు ఆమె వమనం చేసుకున్నచోట బాగు చేసి, గదిలో అగరువత్తులు వెలిగించి, ఆమెకి మళ్ళా వాంతి వస్తే యిబ్బంది లేకుండా, మంచం పక్కనే బేసిన్ ఉంచాడు. పది నిముషాలు తిరక్కుండా మళ్ళీ వాంతి చేసుకుంది. వాంతి [illegible]నప్పుడల్లా, మంచంచివర, మోచేతిమీద బలం ఆన్చి, [illegible] వంగవలసివచ్చేది. వొంట్లో ప్రాణ లేకపోవడంవల్ల

మూడోసారి డోకుక్కుంటున్నప్పుడు యించుమించు కిందపడే టంత పని అయింది. ఒక్క అంగలో దూకి ఆమె పడకుండా పట్టుకున్నాను! బుజాలు పట్టుకుని మనిషిని ఆపానో, నడుం పట్టుకు మనిషిని ఆపానో—నాకీనాడు జ్ఞాపకం లేదు. ఆమెని సరిగా పడుకోబెట్టి, అయిదారు నిముషాలు ఆ పక్కమీదనే కూచున్నాను.

మంజులత ముఖంబాగా అలిసిపోయింది. రెండు కళ్ళలో నుంచి నీళ్ళు జలజల కారుతున్నాయి. పిరమిడ్ రుమాలుతో ఆ కన్నీటి తుంపరలు తుడిచి, 'చాలా బాధపడుతున్న ట్టున్నావు—డాక్టర్ని పిలిపిస్తాను,'' అన్నాను. ఆమెని నేను ఏకవచనంలో సంబోధించడం, నన్నామె మన్నన చెయ్యడం వాతావరణసృష్టికోసం చేస్తున్నాను. మేమిద్దరమూ మాట్లా డుకున్నది చాలామట్టుకు యింగ్లీషులోనే—అప్పుడప్పుడు తమిళంలో.

''వొద్దు. మీరు భోంచేసిరండి. సాయంత్రందాకా నా దగ్గిరే, యిక్కడే, కూచోండి.''

అప్పుడామె అరిచేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. ఆమె చేతివేళ్ళు వణికాయి; మళ్ళీ కళ్ళు చెమర్చాయి.

''డాక్టర్ని పిలుచుకువచ్చేందుకు నేను వెళ్ళక్కర్లేదు. ఫోన్ చేస్తే వస్తాడు. ధనరాజ్ నాకు బాగా తెలిసినవాడే!''

''మీరు వెర్రినిపడకండి. ఏ డాక్టరూ నన్ను బతికించ లేదు. డిశ్చార్జి చేస్తున్నప్పుడు వాళ్ళు హాస్పిటల్లో చెప్పనే

చెప్పారు. ఏ తప్పయితే చెయ్యకూడదన్నారో ఆ తప్పు జరిగింది నాకూ బతకాలని లేదు. ఎందుకు బతికి ?''

ఆ తప్పేమిటో క్షణకాలం ఆలోచిస్తేగాని తెలియని వయసు నాది. మంజులత అధరంమీద మెరిసిన చిరునవ్వు వల్ల ఆ తప్పేమిటో తెలిసింది. రామనాథ్ మీద నాకు పట్టరానంత ఆగ్రహం వచ్చింది. కోపతీక్షణత నాకు తెలియకుండానే ముఖంమీద కనిపించడం పసిగట్టి, ఆ అమ్మాయి అంది : ''అతనిమీద కోప్పడి ఏం లాభం ? నన్ను ఎంతగానో ప్రేమించాడు, పువ్వుల్లో పెట్టి పూజించాడు. ఇవి మాకు చెడ్డరోజులు. అందుచేత కష్టాలు పడుతున్నాం. కష్టాలు వొద్దు, సుఖాలుమాత్రమే కావాలి—అంటే వస్తాయా ? పినతండ్రిని నమ్ముకుని వున్నఉద్యోగం వదులుకున్నాడు. తిప్పలు పడుతున్నాడు. అతన్నిచూస్తే జాలేస్తుంది. నాకోసం చదువుమానుకు, అన్నగారితో దెబ్బలాడి, నన్ను పెళ్ళిచేసుకున్నాడు. ఇటు మా వాళ్ళకీ, అటు వాళ్ళ వాళ్ళకీ దూరమయాం...ఫోంచేసి రాకూడదూ ?''

''నాకు అన్నం సయించ దీ పూట, మనసు ఎలాగో వుంది. డాక్టర్‌కి ఫోను చేసివస్తాను.'' అని పక్కమీదనించి లేవబోతూవుండగా, నా చెయ్యి పట్టుకుంది మంజుల, మొట్టమొదటిసారి ఆ రోగి స్త్రీ అనే భావన కలిగింది. ఏదో విద్యుత్ నాలో ప్రవహించినట్లయింది.

''డాక్టర్ నన్ను ఎలాగూ బతికించలేడు. హాస్పిటల్లో [illegible]పిన మాట అబద్ధం కాదు నేను చనిపోయేదాకా నా

పక్కని వుండండి, అదే నా కోరిక. రామనాథ్ ఏ సాయంత్రానికి వస్తాన్నో! నన్ను వొదిలి వెళ్ళకండి మీరు నా పాలిట దేవుడిలా వచ్చారు. నాకు భయమేస్తోంది. ఏవో నల్లగా కనిపిస్తున్నాయి," అంటూ వణికిపోతూ, వెక్కి వెక్కి ఏడవ నారంభించింది. మనిషిని నా వైపుగా తిప్పుకొని. వీపుమీద చెయ్యివేసి బుజ్జగించాను.

"ఏడవకు, మంజూ, నిన్ను వొదిలి వెళ్ళను. డాక్టర్లు నిన్ను భయపెట్టేందుకు చెప్పివుంటారు. నేను పక్కనుండగా యమభటులు నీదగ్గర కొస్తారా? నీ ప్రాణానికి నా ప్రాణం వొడ్డి కాపాడనూ? భయపడకు, భయమే మృత్యువంటారు పెద్దవాళ్ళు."

నెమ్మదిమాటలు చెప్పి కిందికి వెళ్ళి డాక్టర్‌కి ఫోను చేశాను. అరగంటలో ధనరాజ్ వచ్చాడు. డాక్టర్ పరీక్ష యింకా పూర్తికాక పూర్వమే మళ్ళీ బాధవచ్చిందామెకి. ఉండలా చుట్టుకుపోయి గిలగిల కొట్టుకునేది. ధనరాజ్ మనిషి నంతా పరీక్షచేశాడు. పొత్తికడుపూ, ఊపిరి తిత్తులూ, నాడీ చూశాడు. నన్ను దూరంగా వెళ్ళమని ఆమెని ఏవో ప్రశ్నలు వేశాడు.

"ప్రస్తుతం ఒక యింజెక్షన్ యిస్తాను. యిప్పుడు రెండు అవవస్తోందా, సాయంత్రం ఆరు గంటలకి మళ్ళీ వచ్చి చూస్తాను. బాధని వోర్చుకోగలశక్తి గుండెకి లేదు— అంచేత రోగి నిద్రపోవడం మంచిది. మత్తు కలిగించే యింజెక్షన్ యిస్తున్నాను," అన్నాడు ధనరాజ్ నాతో

ఏ యింజెక్షన్ యిస్తే నాకెందుకుగాని, ఆమె బాధ తగ్గాలి. ఆమె అలా బాధపడుతూవుంటే రెండుకళ్ళూ వొప్ప గించి చూస్తూ కూచోలేను. యింజెక్షన్ పుచ్చుకుంటూ డాక్టర్‌తో అంది మంజులత :

"నిద్దర్లోనే హాయిగా చనిపోయేమందు యివ్వండి. ఈ యమబాధ నేను భరించలేను."

"బాధపడకండి," అంటూ సూదిగుచ్చాడు డాక్టరు.

ధనరాజ్‌ని సాగనంపేందుకు వరండాలోకి వచ్చాను. "ఎవరా అమ్మాయి?" అని అడిగాడతను.

కథ యావత్తూ చెప్పాను. "పాపం!" అని నిట్టూరుస్తూ, "బతకదు" అన్నాడు తీర్పు చెప్పినట్టు.

"అంత గడ్డువ్యాధా?"

"ఆఅమ్మాయి సంసారానికి పనికిరాదు. ఆభర్త పశువో, మృగమో అయివుండాలి."

ఆ సంగతి నా కింతకిపూర్వమే తెలుసు చూచాయగా! "నిజంగా బతకదంటారా ఆ అమ్మాయి?" అన్నాను ఆతుర్దాగా.

నా వ్యాకులత గ్రహించి! "అంత మంచి తనం మీకు పనికిరాదు. నిన్న నీపాటికీ ఆ అమ్మాయి ఎవరో మీకు తెలీదు. యివ్వాళ ఎందు కంత వేదన మీ కామెగురించి, వొద్దు. వొద్దు; పసితనంవల్ల బేజారై పోతున్నారు," అంటూ నా వీపుతట్టి నిష్క్రమించాడు ధనరాజ్.

నేను గదిలోకి వచ్చేటప్పటికి ముఖమంతా కళ్ళు చేసుకు చూస్తోంది మంజులత. నౌకరు కొత్త అగరువత్తులు వెలిగించి, బేసిన్ కడిగి పట్టుకొచ్చాడు. మూడవ వాంతితో ఆ వాంతులు ఆగలేదు. అడపా దడపా అవుతూనే వున్నాయి. నాలిక పిడచగట్టుకు పోతోందని మంచినీళ్ళు తాగేది; బుళుక్కున వాంతి చేసుకునేది.

"వాసనేస్తోందిగదూ!" అనేది మధ్య మధ్య. అలాంటి మాటలనవద్దని వారించేవాణ్ణి.

గది తలుపు జేర్లావేసి వుండేది. నౌకరు వున్నప్పుడు కుర్చీమీద, నౌకరు లేనపుడు, మంచంమీద కూర్చునేవాణ్ణి. డాక్టర్ని పంపి గదిలోకి రాగానే, "ఏమన్నాడు డాక్టర్?" అంది మంజులత.

"తగ్గిపోతుందన్నాడు."

"అబద్ధం."

"నిజమే. ఇంకో పావుగంటలో నీకు నిద్దర పడుతుంది హాయిగా నిద్దరపో."

"నిద్దర పట్టగానే మీరు వెళ్ళిపోతారా?"

"నేను వెళ్ళిపోవడమా? నిన్ను వొదిలి ఎప్పటికీ వెళ్ళను. మంచిపిల్లలా నిద్దరపోమ్మా!" అన్నాను, ముద్దు చేస్తూ.

"మా అమ్మమ్మ చనిపోతూ యమదూతల్ని చూసి గావుకేకలు పెట్టింది. నేనూ అలా కేక లేసి యితరుల్ని

భయపెట్టకుండా, శాంతంగా చనిపోగలిగితే......మీ చేతుల్లో నా ప్రాణాలు వొదల నివ్వరూ ?''

ఈసారి కన్నీళ్ళు నాకొచ్చాయి. ఈ అమ్మాయి చచ్చి పోతుందా ? నిజంగానా ? ఊరూ పేరూ తెలియని పరాయి మనిషి సమక్షంలో, 'నా' అనేవాళ్ళు ఎవరూ లేనిచోట, పట్నవాసపు హోటల్ గది నాలుగుగోడలూ వెక్కిరిస్తూ వుండగా, ఈ చిన్నపుష్పం నేలకలుస్తుందా ? ఏమిటీ మానవ జీవితం ? మృత్యుప్రాంగణంలో మేడలుకట్టే మన ఆశలకీ ఆవేదనలకీ అర్థం ఉందా ? ఎంత దేవుళ్లాడుతాం-భర్తృహరీ, వేమనా చెప్పిన పరమసత్యాలు తెలుసుకోలేక !

ఆమె ఫాలభాగంమీద చెయి ఉంచాను. పెద్ద జ్వర మేమీ లేదు. కణతలు వేగంతో కొట్టుకుంటున్నాయి.

''మంజూ, నువ్వు బతుకుతావు. నీకు తెలీదు—నువ్వు బతుకుతావు. నామాట నమ్ము.''

ఆమె పెదవులమీద వెలిసిన నీరసపు నవ్వులో ఈ ప్రపంచపు క్షోభలన్నీ ప్రతిబింబించాయి. ఆమె గెడ్డాన్ని నొక్కుతూ యింకోసారి అన్నాను : ''నమ్ము, మంజూ !'' అప్పుడే మగత వచ్చేస్తోంది. ''ఆ'' అంటూ నిద్రపోయింది.

కాస్త కాఫీ టిఫినూ ఆ గదిలోకే తెప్పించుకు తిన్నాను. మళ్ళీ మరికొన్ని అగరువత్తులు వెలిగించాను. షోకులవల్ల గదికి రోగిష్టి వాసన వచ్చింది. నిద్రపోతున్న ఆమెని పరిశీల నగా ఒక గంటసేపు చూశానేమో ! అర్థంపర్థంలేని ఆలో

చన లెన్నో మెదడుమీదుగా దొర్లిపోయివుంటాయి. రామనాథ్‌ని తలుచుకుంటే ఒక్కొక్క క్షణాన జాలి వేసేది; మరొక్కొక్క క్షణాన వొళ్ళు మండే కోపంవచ్చేది.

బుర్ర వేడెక్కడంవల్ల చదువుకోడానికి పుస్తకం తెరిచాను. పేజీలు సాగితేనా! సాయంత్రం అయిపోయింది. తలుపు నెమ్మదిగా లోపలికి తోశాడు వెంకటపతి. చీమ చిటుకుమంటే ఆమెకి మెలకువ వస్తుందేమో అన్నట్టు, పదిలంగా అడుగులు వేసుకుంటూ మంచందగ్గిరికి వచ్చి, కళ్ళు పెద్దవిచేసుకు చూశాడామెని వెంకటపతి.

"ఇద్దరమూ వరండాలోకి వెళ్ళాం. జరిగినది వెంకటపతికి చెప్పాను.

"మధ్యని మీకొచ్చి చుట్టుకుందేమిటి ఈ పాపం!"

అతనలా పర్దాక్షిణ్యంగా అనడం మనస్కరించక; "అలా అంటారేమిటి! కష్టాలు ఎంతటి వారికైనా వస్తాయి. ఆమాత్రం ఉపకారబుద్ధి లేకపోతే మనకి మానవులనిపించుకునే అర్హత ఏమిటి? రామనాథ్ రాత్రికూడా వస్తాడో, రాడో! మీ ఆవిడ పర్మిషన్ తీసుకు యిక్కడ పడుకోకూడదూ మీరీ రాత్రి?"

"ఓ—నిక్షేపంగా! కందకులేని దురద చేమకెన్నట్లు—మధ్యని మీరు యిరుక్కున్నారే ఇందులో—అని అన్నాను గాని, మరోకందుకు కాదు. ఆపత్సమయంలో యిలాటివి చూసుకుంటామా? తప్పకుండా వస్తాను. పాపం—ఆ అమ్మా

యిని రంగుల రామచిలక అన్నా కాని, సీతా అమ్మవారు వంటిది. ఆ పిల్లది బతికి బట్టకడితే మంచక దే పనివేలు."

నాకు ఆ అమ్మాయిమీద దయారసం ఉందని గ్రహించిన ఉత్తరక్షణంలో వెంకటపతి ధోరణి మారిపోయింది. మంచి అయినా చెడ్డఅయినా నడుంకడదామన్నాడు. అతని ఊహ ఎంతదాకా పోయిందంటే—రామనాథ్ యింక ఎప్పటికీ రాక, ఆ అమ్మాయి దారీ తెన్నూ లేక నాదగ్గర వుండి పోవలసివస్తే—అదీ అంత యిబ్బంది లేదట. అలాంటి అంద మైన స్త్రీ యింటిని దివ్యజ్యోతిలా వెలిగించగలదట.

వెర్రితలలు చేసే ఆలోచనల్ని అరికట్టనున్నాను: 'ఈ రాత్రికి ఆమె బతుకుతుందో బతకదో' అని డాక్టరు చెప్పిన మనిషిగురించి, పతి అల్లే కాల్పనిక జగత్తు నీటిబుడగలాంటి దనే యింగితం నాకు లేకపోలేదు. కాని వెంకటపతి, నా కంతవరకూ కలగని కొన్ని అసందర్భపు టాలోచనలు నాలో ప్రవేశపెట్టాడు. పుస్తకవ్యక్తులతో, కాలక్షేపం చేసే నాకు, వెంకటపతి మాటలు జీవిత సుడిగుండాల్ని జ్ఞాపకం చేసేవి. సంస్కారరీత్యా అతను నాకంటె తక్కువవాడని తెలిసి వున్నప్పటికీ, అందుకే Tolerate చేసేవాణ్ణేమో అతన్ని!

డాక్టర్ వచ్చాడు. ముగ్గురమూ లోపలికి వెళ్ళాం. స్విచ్ నొక్కగానే వులిక్కిపడి లేచింది మంజులత. బయట కొద్ది కొద్దిగా చీకటి పడుతోంది. క్షణకాలం మా ముగ్గుర్నీ భయం భయంగా చూసింది.

"అలా చూస్తావేం !" అన్నాను.

"నేనింకా బతికేవున్నానా ?" అంటూనే గిలగిల కొట్టుకోనడం మొదలెట్టింది పావుగంట అలా తన్నుకుంది. డాక్టర్ గుండె చూశాడు. మధ్యాహ్నం యింకో యింజెక్షన్ యిస్తానన్నవాడు యిప్పు డివ్వ నన్నాడు. నాలుగు పొట్లాలు యిచ్చాడు. బాధ భరించలేనప్పుడు, గంటకి తక్కువకాని వ్యవధితో, ఆ పొట్లాలు వేసుకోవాలన్నాడు. పతిని ఆమెవద్ద కూచోబెట్టి డాక్టర్‌తో వరండాలోకి వచ్చాను.

"ఏమనంటారు ?"

"గ్లూకోజూ, పాలూ, అయిసూ కలిపిన నీళ్ళు చంచాతో, మింగుడు పడేటంతవరకూ, యిస్తూవుండండి. యింజెక్షన్ యివ్వడానికి గుండె అతి నీరసంగా ఉంది. యింజెక్షన్ యిచ్చినా ఒకటే, యివ్వకపోయినా ఒకటే. రాత్రి రెండు మూడు గంటల లోపున ఆమె చచ్చిపోతుంది."

పాదాలకింద గొయ్యి పడ్డట్టనిపించింది. "ఎంత డబ్బయినా ఆమెకోసం ఖర్చుపెడతాను. ఆమెని బతికించలేరూ ?" మతిలేని మాటలు—మతి వున్నవాడు అలా మాట్లాడుతాడా ?

నేను దిగజారిపోవడం కనిపెట్టి ధనరాజ్ అన్నాడు. "మీరు మనసు కలవరపెట్టుకోకండి. జాతస్య మరణం ధృవం—నిన్న సాయంత్రం ఈవేళకి ఆవిడెవరో మీకు తెలీదు. ఎందుకంత కంగారు పడతారు ? ఆవిడకి అయుర్దాయం ఉంటే బతుకుతుంది."

"మీరేమీ చెయ్యలేరా?"

బుజం తడుతూ, "కథలు రాసే మీకు, డాక్టర్లు మందు లిస్తారు గాని ఆయుర్దాయం యివ్వలేరని, నేను చెప్పాలా?" అన్నాడు.

"ఆమె చనిపోతుందంటారా?"

"బతికివుంటే రేపు పొద్దున్న ఏడు గంటలకి ఫోన్ చెయ్యండి."

"బతకదనేగా మీరనేది! ఆ రామనాథ్—ఆమెభర్త—ఎక్కడ వున్నాడో వెతకడం మనవిధిగా."

"ట్రాములు కట్టేసేవేళకైనా అతను రాకపోతాడా? పన్నెండూ మూడుగంటల మధ్య ప్రాణం పోవచ్చు. పాపం—ఎవరి కెక్కడ రాసిపెట్టి ఉందోగదా!"

నాకు ముందు వెనకలు తోచలేదు. కళ్ళు చీకట్లు కమ్మాయి. యంత్రంమాదిరి గదిలోకి వచ్చాను. సేట్ జీ ఒక కుర్చీమీదా వెంకటపతి ఒక కుర్చీమీదా కూచుని ఆమె అసహాయతగురించి విచారిస్తూ, నా ఉదారబుద్ధిని శ్లాఘిస్తున్నారు.

"మీకు దేవుడు తప్పకుండా మంచిచేస్తాడు," అన్నాడు సేట్ జీ నన్ను ఉద్దేశించి. ఆమె ఆరాత్రి మరణిస్తుందని డాక్టర్ చెప్పిన సంగతి సేట్ జీకి నేను చెప్పలేదు; వెంకటపతికూడా తెలివిగా దాచాడు ఆ విషయం. కాసేపు రోగాల గురించీ మందుల గురించీ మాట్లాడి సేట్ జీ వెళ్తూ గుమ్మం

దగ్గిర నాతో అన్నాడు : "అతను—ఆ రామనాధ్—వొట్టి దగుల్బాజీ. మీరు ఆదుకోకపోతే ఆ అమాయకురాలు ఏ మయ్యేది ?"

తెల్లారేటప్పటికి ఆమె కష్టాలు తీరుతాయి గాబోలు ! ఈ దుర్భగజీవన నాటకానికి తెరపడుతుంది కాబోలు. అవమానాలూ, చిన్నచూపులూ, యాచనలూ లేకుండా ఈ తమస్సాంద్రపు ఆవలితీరం చేరుతుంది కాబోలు ! ఏమో!!

వెంకటపతి భోంచేసి వచ్చేందుకు వెళ్ళాడు. సాయంత్రం ఏడవుతోంది. ఆమె పక్కలో కూచుని పట్టుకుచ్చులాంటి జుట్టు నిమురుతున్నాను. నిన్నటి సాయంత్రం–నాకు—ఈమె లేదు; రేపు సాయంత్రం—నాకు—ఈమె ఉండదు. తెల్లారే లోపున ఈ పసిడిదేహంలోని పరమాయువు మాయమవుతుందా ? రెండు చెక్కిళ్ళూ మృదువుగా స్పృశిస్తూ, చూపుడువేలితో నుదురుమీద రాస్తూ "మంజూ, నీకు బతకాలని లేదూ ?" అని అడిగాను.

"ఎందుకు బతకడం ?"

"నాకోసం."

"నేను మీ కెందుకు ?"

"ఎందుకో నాకు తెలీదు. నువ్వు బతకాలి. బతికితీరాలి. నాకోసం నువ్వు బతకాలి, ఎందుకని అడగకు." నా కంఠం రోదనస్వరంతో వణికింది. ఆమె కళ్ళలో క్రొత్తలోకాలు వెలిగాయి. చెక్కిలిమీద వున్న నా చేతిని తన చేతిలోకి

తీసుకుని, చెంపమీాద పెట్టుకు, ఆ చేతిని బంధిస్తున్నట్టుగా ఒక పక్కకి వరిగింది.

"మధ్యాహ్నం భోంచెయ్యలేనట్టు ఉంది. తొందరగా భోంచేసిరండి." ప్రేమించే స్త్రీలు మన అన్నపానాదుల గురించి ఒకటికి నాలుగుసార్లు కనుక్కుంటారని ఆనాడు నాకు తెలీదు.

"భోంచెయ్యాలని లేదు."

"వొద్దు! వొళ్ళు చెడిపోతుంది. నాకర్ని యిక్కడ వుండమని మీారు వెళ్ళిరండి"—అంటూ గెడ్డం పట్టుకుంది. మా యిద్దరిమధ్యా మాతోటే సమిసిపోవలసిన చనువు వస్తోంది. ఆ చనువులోని అంతరార్థం మా ఆత్మలకే తెలుసు—లోకానికి తెలీదు.

పొద్దున్న, చనిపోతానని—తను—భయపడింది. ఈ పూట, డాక్టరు చెప్పడంవల్ల, చనిపోతుందని—నేను భయపడుతున్నాను. నేను భోంచేసి వచ్చేవేళకి, మంజు మొహానికీ చేతులకీ పౌడరు రాసుకుపడుకునుంది. పొద్దుట్నుంచీ అక్కర్లేకపోయిన పౌడరు యిప్పుడు ఎందుకు కావలసివచ్చిందో!

"మీారు వెళ్ళినతర్వాత ఒక వాంతి అయింది; మళ్ళీ నొప్పి వచ్చేటట్టు ఉంది."

"గ్లూకోజ్ వాటర్ తాగావా?"

"తాగడంచేతనే వాంతి వచ్చింది."

"పౌడరు ఎందుకు రాసుకున్నావు?"

"లవండర్ కూడా రాసుకోవాలనిపించింది. కాని సీసాలో లేదు."

వొద్దంటున్నా, నా గదిలోనుంచి లవండర్ సీసా తీసుకు వచ్చి ఆమెకి యిచ్చాను, బట్టలమీద చల్లుకుంది.

"వెంకటపతి ఏమనుకుంటాడు?"

"ఎవరాయన?"

"ఇందాక వచ్చిన స్నేహితుడు."

"మళ్ళీ వస్తాడా ఆయన?"

"రాత్రి మనకి సాయంగా యిక్కడే పడుకుంటాడు."

"బయట మడతమంచం వేయించి పడుకోమనండి. పాపం, ఆయన్ని కూడా శ్రమపెట్టడ మెందుకు?"

ఇంత తెలివిగా మాట్లాడుతున్న మనిషి రాత్రి రెండు గంటలలోపున ఎలా చనిపోతుంది? ధనరాజ్ చెప్పాడు; ఆమె చావు అమాంతం వస్తుందని, మాట్లాడుతూ మాట్లాడుతూ Collapse అవవచ్చునని. బహుశా మనసులో ఆమెకీ దృఢంగా తెలుసునేమో చచ్చిపోతానని. వెంకటపతి వొచ్చాడు; అతను బీడీ కాల్చుకుంటూ బయట మంచం మీద పడుకున్నాడు.

పది నిముషాలూ పావుగంటా మగతనిద్ర పోతూ లేస్తోంది మంజులత. రామనాథ్ వచ్చినా ప్రమాదం లేదనీ, తన పక్కలో అలా కూచుని వుండవలసిందనీ నిష్కర్షగా చెప్పింది. నాకడు వెంకటపతి మంచం పక్కనే పడుకున్నాడు. తొమ్మి

దయింది, పడయింది. భర్త అయిపూ జాడా లేదు. వొద్దని మారాం చేస్తున్నప్పటికి పదింబావుకి కాసిని గ్లూకోజ్ నీళ్ళు పట్టాను; తాగింది. ఏదో భయం భయంగా ఉందంది. నాకూ మనసులో దుడుకుగానే ఉంది; మేకపోతు గాంభీర్యం చూపెట్టాను. గదిలో హండ్రెడ్ కాండిల్ బల్బు వెలుగుతోంది. కిటికీలని చూసి భయపడుతుందని కిటికీతలుపులు వేశాను. ఎలక్ట్రిక్ పంకా టక్ టక్ మంటోంది. అగరు ధూపం మత్తు కొద్దిగా తగ్గింది.

"చంద్రోదయమయితే గాని చావరటగా!"

మళ్ళీ ఈ మాటలు మాట్లాడుతుందని నేను అనుకోలేదు. మనసులోనుంచి ఆ భయోత్పాతం ఆమెకి పోలేదు.

"నీకేమీ ప్రాణాపాయం లేదని డాక్టర్ చెప్పాడు."

"మీకు అబద్ధమైనా చెప్పివుంటాడు; లేదా ఆయన కాపాటి తెలుసుకునే శక్తి అయినా లేకపోవాలి. నాకు చావు ఎలా వస్తుందో నాకు తెలుసు—తఫీమని గుండె ఆగి మరణిస్తానట. బాధ రాబోయేముందు గానీ, బాధ తీరిన పది పదిహేను నిముషాల్లోగాని ఆపని జరగవచ్చు."

"మంజూ, నువ్వు బతుకుతావు—నీకు తెలీదు" అంటూ ఆమె నుదుటిమీద ముద్దుపెట్టుకున్నాను.

ఆ రోగిష్టిమనిషి అదోలా నవ్వుతూ, "నన్ను ఎందుకు ముద్దెట్టుకున్నారు—తప్పు కాదూ?" అంది.

"తప్పూ లేదు, గిప్పూ లేదు." అంటూ ఆమె వెన్నెముక మీద చేతివేళ్ళతో హార్మోనియం వాయించాను.

"అయ్యో, నామీద మీకీ మమకారం ఎందుకు ?" అని దీనంగా, భూదేవిలా వాపోయింది.

పదకొండయింది—భర్త రాలేదు. వెంకటపతి మాటలు జ్ఞప్తికొచ్చాయిగాని మంజుని శిరీషపుష్పంలా ధరించగల ధైర్యం నాకొచ్చింది అమాంతం. రాఘునాథ్ వస్తాడూ, వచ్చినవాళ్ళలో జత—రాడూ, పోయినవాళ్ళలో ఒకడు. మంజు ఈ ఉపద్రవంనుంచి దాటితే, ఆ మెరుగురించిన సమస్తం నేను చూసుకుంటాను.

పన్నెండుకి యిరవై నిముషాలు వుండగా వులిక్కిపడి లేచి, నావొళ్ళో తలపెట్టుకు పడుకుంది. పట్టుకుచ్చులాంటి జుట్టుని గోళ్ళతో దువ్వుతూ లాలిస్తున్నాను. మళ్ళీ కాస్త కునుకుపట్టిందామెకి. పన్నెండూ అయిదు నిముషాలకి ఒక్కసారి కెవ్వున కేక పెట్టింది. పక్కగదుల్లో వాళ్ళు పరిగెత్తుకు వస్తారనుకున్నానుగాని రాలేదు. ఆఖరికి వెంకటపతికి కూడా మెలకువ రాలేదు.

"కడుపు నరాలు తోడేస్తున్నాయి. ఈ గదంతా గిరగిర తిరుగుతోంది. ఇంత చీకటిగా ఉందేమి ?"

మంజులత మనలోకంలోనుంచి వెళ్ళిపోతున్నట్టుంది. గదిలో అంత పెద్దదీపం వెలుగుతూవుండగా చీకటేమిటి ? ఆమెని దిండుమీద పడుకోబెట్టి వెంకటపతిని లేపనా ? అతను మాత్రం ఏం చెయ్యగలడు ? ఈ అపూర్వబాంధవి మరణం నా చేతుల్లో ఉందా ? పెద్దపెట్టున ఏడుపొచ్చింది, ఏడవలేను. వొళ్ళు జలదరించింది.

"మంజూ!" అన్నాను నెమ్మదిగా.

"ఏమిటండీ?"

"కలవరిస్తున్నావు."

"కలవరింత కాదు. ఏదో అయోమయంగా ఉంది. నన్ను వొదిలి వెళ్ళకండి."

"నువ్వు నా మంజువి. నాకోసం బతుకుతావు. నిన్ను నేను బతికించుకుంటాను. ప్రేమలో అమృతానికి వుండే గుణం ఉందన్నారు. అంచేత, నువ్వు బతక్క తప్పదు."

ఆమె బతికింది. సులువుగా ఒక్క మాటలో ఆ సంగతి ఈనాడు చెబుతున్నాను గాని, ఆనాడు తెల్లవారుజాము నాలుగు గంటలదాకా ఎంత బాధపడింది మంజు! విలవిల తన్నుకునే ఆమె పాంచభౌతిక శరీరాన్ని చూసి నేనెంత ఏడ్చాను! బాధలూ కన్నీళ్ళూ కాలమనే మహార్ణవంలో కలిసిపోతాయి కదా! నా మంజు నా కోసం మృత్యువుతో హోరాహోరిని పోరాడింది. ఎంత అహం—నా మంజు, నా కోసం; మంజూ నేనూ జీవితంలో కలుసుకోము. కలుసుకోకపోయినప్పటికీ ఎంత అహం!

మర్నాడు పొద్దున్న ధనరాజ్ మంజులత బతకడం 'మిరకిల్' అన్నాడు. ఆ సాయంత్రం ఆమెకింక ప్రాణభయం లేదన్నాడు. ప్రాణాపాయస్థితి దాటిన తర్వాత ఎర్రదుద్దులు ఆమె చేతిలో పెట్టాను.

"యివి మీకెలా వచ్చాయి?"

"యివి యిద్దామనే నిన్నపొద్దున్న మీ గదిలోకివచ్చి జన్మజన్మాలకీ మరుపురాని అనుబంధం ఏర్పాటు చేసుకున్నాను."

మంజులత నీరసంగా కాక శృంగారాన్ని వొలకబోస్తూ నవ్వింది.

"రామనాథ్ రాడాయిక?" అన్నాను.—నేను అడగకూడని ప్రశ్నే, కాని అడక్క తప్పదు.

"వస్తాడు—ఈ సాయింత్రం తప్పకుండా వస్తాడు."

ఆమె చెప్పినట్టుగానే సాయింత్రంవేళ రామనాథ్ వచ్చాడు. భార్యాభర్తలు ఏమి మాట్లాడుకున్నారో తెలీదుగాని కన్నీళ్ళతో నాకు కృతజ్ఞత తెలిపాడు. మరునటి ఉదయం అతను బెంగుళూరు వెళ్ళాడు,—ఆ సంగతి డాక్టరు వచ్చినపుడు మంజులత చెప్పేదాకా నాకు తెలీదు.

"ఎప్పుడొస్తాడు?"

"రేపే వస్తానన్నాడు. రాగలడో, రాలేడో! మా బ్రదర్‌కి టెలిగ్రాం యివ్వండి—మావాళ్ళింటికి వెళ్ళిపోతాను."

"ఇక్కడ వుండకూడదా?"

"మీకు తెలీదు—చిన్నతనం." అలా అన్నందుకు కాసేపు అలిగాను—చటుక్కున జ్ఞాపకం వచ్చి "దుద్దులేవి?" అన్నాను.

"యివ్వలేదు. తలగడకింద దాచాను. మీరు సేట్‌జీ దగ్గిర్నుంచి తీసుకున్నట్టు అతనికి తెలీదు."

మంజులత, నాలుగురోజుల్లో ఎంతో చనువయింది. నాతో చిన్నపిల్లలాగ ఆడుకునేది; నన్ను ఆడించేది. స్త్రీ మనసివ్వడమంటే ఏమిటో అంతవరకూ పుస్తకాలలో చదివానేగాని అనుభవంలో లేదు. మంజులతకి జుట్టుదువ్వడం, పౌడర్ రాయడం నా డ్యూటీస్.

సాయంత్రం అయిపోతుంది. పక్క డాబా మీద పదహారు పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తమ్ముడి గాలిపటం ఎగర వేస్తోంది. మంజులత డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూచుని వుంది. నేను పక్కన నుంచుని ఆమె మొహంమీద యార్డ్లీస్ మెత్తుతున్నాను. గాలిపటం ఎగరవేస్తున్న అమ్మాయిని చూపి మంజులత ఛటాలున అడిగింది : "అలాటి అందమైన పిల్లని మీరు పెళ్ళిచేసుకోకూడదూ ?"

"నీకంటె అందంగా ఉందా ఆ అమ్మాయి ?"

మంజులత కన్నీళ్ళు అద్దంలోనుంచి కనిపించాయి. ఇట్టే వెనక్కి తిరిగి నా చెంపలు తన చేతుల్లోకి తీసుకు, నన్ను దగ్గిరికి రమ్మని ముద్దెట్టుకుంది. బతుకు పండినట్లనిపించింది. పుష్కరం గడిచినా ఆ ముద్దు గురించిన జ్ఞాపకం జీవితానికి పరిమళ మాపాదిస్తోంది. ఆమె పాదాల దగ్గిర కూచుని ఒళ్ళో తలపెట్టుకున్నాను.

"మీరుణం ఈ జీవితంలో నేను తీర్చుకోలేను. మనకి జన్మలనేవే వుంటే, మరొక జన్మలో కలుసుకోకపోము. ఈ జన్మలో నేను మీకు పనికిరాను. ఏదు మాల్‌తో నా కన్నీళ్ళు

తుడిచారో అది నాది; ఈ ఎఱ్ఱ ముద్దులు మీవి, మీ రెవర్ని పెళ్ళి చేసుకుంటారో ఆమెకి యివి యివ్వండి. రేపు మా బ్రదర్ వస్తాడు. ఈ ఒక్క రోజూ మనం కన్నీళ్ళతో గడప వద్దు. అడవిపిట్టలా నేను మీ దగ్గిరికి వచ్చి వాలాను; అలానే వెళ్ళిపోతాను. బాధపడకుండా, నన్ను నవ్వుతూ రైలెక్కించండి. నేను మీకు తగనని మీకు తెలుసు; కాని బంధన వొదుల్చుకోలేక బాధపడుతున్నారు."

మంజులత నిజం చెప్పినప్పటికీ ఆమె మాటలన్నీ నేను వొప్పుకోలేకపోయాను. నా పిరమిడ్ కెర్‌చీఫ్ తాను తీసుకుని, ఎఱ్ఱదుద్దులు నా చేతిలో పెట్టింది. మనుషులమే విడిపోతున్నప్పుడు చిహ్నలుమాత్ర మెందుకన్నాను. నవ్వి, ముక్కుపట్టుకు, లెంపలు వాయించింది. స్త్రీ సహజమైన చాతుర్యంవల్ల, రైలుదగ్గిరికి వెళ్ళేవరకూ, తన కొంగుని కట్టుకు తిప్పుతుంది నన్ను.

రైలు కింకా యిరవై నిమిషాల టైము ఉంది. బ్రదర్ సామాను సర్దుకుని పెట్లో కూచున్నాడు, నేనూ మంజులతా యింజను చివరిదాకా నడుచుకుంటూ పోయాం. సాయంత్రం నేను ప్రజెంటుగా యిచ్చిన తెల్లచీరె కట్టుకుంది; ఊదా జాకెట్ వేసుకుంది. జుట్టు అందంగా దువ్వుకు, నాజూకుగా లేత తమలపాకులా కనిపిస్తోంది. మనుషుల రద్దీలేనిచోట నుంచున్నాము.

"నేను మిమ్మల్ని వొదిలి వెళ్ళలేకుండా వున్నాను. కాని వెళ్ళక తప్పదు." కంటి ముత్యాలు మెరిశాయి. దగ్గిరకి

తీసుకునేందుకు అది జనసమ్మర్దం గల ప్రదేశం. "మీరు చేసినదానికి నేను మీ కేమీ యివ్వలేకపోయాను గదా!"

నాలోని పురుషుడు నిద్రించాడు. ఆమె ఆత్మ నిజ స్వరూపం గోచరమయింది. "ఛీ—అలా అనుకోకు, నువ్వు ఎక్కడో అక్కడ సుఖంగా ఉండాలి. మంజుని నేను బతికించుకున్నాను జన్మ జన్మాలకీ 'యిది' నా మంజూయే!"

బాగా వెలుగులోకి వచ్చేదాకా చెట్టాపట్టాలు వేసుకు నడిచాము. హృదయావేదనని మరుగు పరచ ప్రయత్నించే మా తెచ్చికోలునవ్వులు, వర్షంపడ్డ తర్వాత కాసిన ఎండ లాటివి. బ్రదర్ వెర్రిగా చూస్తున్నప్పటికీ, రైలు కదిలే దాకా మంజు చెయ్యి నా చేతిలో ఉంది. మాంగుళూర్ మెయిల్ మా యిద్దరి చేతులూ విడదీసింది. అందుకనే నాకు మాంగుళూర్ మెయిల్ అంటే అంత కోపం!

మంజులత ఏమయిందో నన్ను అడక్కండి. 'దేవదాసు' లోని పార్వతి ఏమయిందో శరత్ బాబు చెప్పలేకపోయినట్టే, నేనూ చెప్పలేను. నా మంజులత పార్వతంత గొప్పది కాదు. చెప్పలేకపోవడానికి ఉదాహరణగా మాత్రమే ఆ ప్రసక్తి తెచ్చాను. పుష్కరం గడిచింది. మంజులత ఈ నాడు ఒక స్మృతి. ఆ స్మృతిని ఉన్నదున్నట్టుగా కాయితం మీద కెక్కించాను; మీరు చదివారు. ఒక్క విషయం; నా భార్య చెవులకున్న ఎర్రదుద్దులు నిజానికి మంజులతవి.